క్లుప్తంగా

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



బొడ్డరేవులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎస్ వెంకట్రావు

మాడుగుల రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కలిగి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కె.జె.పురం పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకుడు కె.వెంకట్రావు సూచించారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శంకరం పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన బొడ్డరేవులో సోమవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా పరిశుభ్రత పాటించి, దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జి.బేబి, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే



స్పర్శలేని మచ్చలున్న వారిని గుర్తించే సర్వేలో సన్యాసిరావు, వైద్య సిబ్బంది

కె.కోటపాడు: కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా అంగ వైకల్యం సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు తెలిపారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు గల వారిని గుర్తించేందుకు ఉగ్గినవలసలో సోమవారం పలువుర్ని తనిఖీ చేశారు. కుష్టు వ్యాధికి ఇంటి వద్దే ఎండీటీ మందుల్ని వైద్య సిబ్బంది వచ్చి, అందిస్తారన్నారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పీ మంగవేణి, ఏఎన్ఎం రాము, గంగాధర్ ఉన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో యూరియా

దేవరాపల్లి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులోకి వచ్చింది. ఖరీఫ్ దమ్ములతో పాటు చెరకు సాగులో వేసేందుకు దీన్ని రైతులకు అందించనున్నారు. కొత్తపెంట, దేవరాపల్లి సహా పలు గ్రామాల్లోని ఆర్బీకేల్లో యూరియాను నిల్వ చేశారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ తెలిపారు. సోమవారం సాయంత్రం దేవరాపల్లి వ్యవసాయ కార్యాలయం కిందనున్న గోదాంలో 260 యూరియా బస్తాలను అందుబాటులో ఉంచారు.

కె.వల్లాపురంలో పారిశుధ్య నిర్వహణ

మాడుగుల: వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాల తొలగింపు కార్యక్రమాలను గ్రామాల్లో చేపట్టారు. కింతలి వల్లాపురంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, పంచాయతీ కార్యదర్శి ఎస్.అప్పారావు పర్యవేక్షణలో డ్రైనేజీల్లో పూడికను సోమవారం తొలగించారు. గ్రామంలో ఉన్న 6 తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేశారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

'శిక్షా సప్తాహ్'తో మెరుగైన బోధన



మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవోలు

చోడవరం రూరల్: మండలంలో వారం రోజుల పాటు సాగే 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారులు ఎస్.జయలక్ష్మి, కె.సింహాచలం సోమవారం ప్రారంభించారు. స్థానిక వనరులతో తయారు చేసిన బోధనాభ్యసన సామగ్రితో బోధన ద్వారా విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వి.లక్ష్మీకుమార్, సీఆర్ఎంటీ కేవీ మహాలక్ష్మినాయుడు పాఠశాలలో తాము సిద్ధం చేసిన బోధనా పరికరాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఈ ప్రదర్శనలు ఉపకరిస్తాయన్నారు. ప్రదర్శనకు హాజరైన తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోను వారం రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



గళం విప్పండి.. అభివృద్ధికి బాటలు వేయండి

కొత్త ప్రభుత్వం కొలువుదీరాక తొలిసారిగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మొదలయ్యాయి. ఎన్నికల సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో హామీలు, ఆశలు కల్పించారు. వాటిని నమ్మి, ఓటేసి గెలిపించిన ప్రజలకు మేలు జరిగేలా కృషి చేయాల్సిన తరుణమిది. అందుకే గెలిచిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తమ స్వరం వినిపించి, నియోజకవర్గాల్లో ప్రధాన సమస్యలు, అర్ధంతరంగా నిలిచిన అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

- అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యల్ని ప్రస్తావించాలి
- ఎన్నికల నాటి హామీలను నిలబెట్టుకోవాలి
- ఎమ్మెల్యేలకు స్థానిక ప్రజల వినతి



మాకవరపాలెంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనం



అసంపూర్తిగా నిలిచిన బీఎన్ రోడ్డు విస్తరణ పనులతో ప్రయాణికుల తిప్పలు

నర్సీపట్నం: గత ప్రభుత్వంలో మాకవరపాలెం మండలం, భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో చేపట్టిన మెడికల్ కళాశాలను పూర్తి చేస్తే, స్థానిక ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని స్థానిక ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

- వ్యవసాయరంగాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఏలేరు–తాండవ ఎత్తిపోతల పథకంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని రైతాంగం కోరుతోంది.
- తాండవ జలాశయం ఆనకట్ట గేట్ల మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టినట్లయితే ఆయకట్టు రైతులకు అవసరమైన సాగునీరు అందుతుంది.
- తాండవ–నాతవరం రోడ్డును నిర్మిస్తే రాకపోకల సమయంలో ప్రజల ఇబ్బందులు తీరతాయి.
- నర్సీపట్నం మున్సిపాలిటీలో గత ప్రభుత్వంలో చేపట్టిన మెయిన్ రోడ్డు విస్తరణను పూర్తి చేస్తే, ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు టౌన్ అభివృద్ధి చెందుతుంది.
- మున్సిపాలిటీలో అసంపూర్తిగా మిగిలిన ప్రత్యామ్నాయ రోడ్డును పూర్తి చేస్తే ప్రజలకు మరింత మేలు చేకూరుతుంది.
- ఉదయం, సాయంత్రం వేళల్లో సరదాగా కుటుంబ సభ్యులతో గడిపేందుకు మున్సిపాలిటీలో పార్కులు లేక అవస్థలు పడుతున్నారు.
- పట్టణంలో ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సత్తాచాటుతున్నారు. సరైన శిక్షణ పొందేందుకు ఇండోర్ స్టేడియం లేక ఇబ్బందులు పడుతున్నారు.
- మున్సిపాలిటీ వాసుల దాహార్తిని తీర్చేందుకు గత ప్రభుత్వం రూ.168 కోట్లతో భారీ మంచినీటి ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అసంపూర్తిగా నిలిచిన ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తే ప్రజల తాగునీటి కష్టాలు తీరతాయి.
- సుమారు లక్ష జనాభా ఉన్న మున్సిపాలిటీలో 130 కిలో మీటర్ల మేర డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇది 45 కిలో మీటర్లు మాత్రమే ఉంది. పూర్తిస్థాయిలో పక్కా డ్రైనేజీ ఏర్పాటుకు రూ.77 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి మోక్షం కలిగించాలి.
- నర్సీపట్నం పెద్దచెరువును ట్యాంక్‌బండ్ మాదిరి అభివృద్ధి చేస్తే పట్టణ వాసుల చిరకాల కాంక్ష నెరవేరుతుంది.
- గొలుగొండ మండలం లింగంపేట గ్రామంలో ఉన్న భారీ తాగునీటి పథకం సరిగ్గా పనిచేయక 30 గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పైపులు లీకేజీ అవుతున్నాయి. కొత్త పైపులు వేయించి, సమస్య పరిష్కరించాలి.
- పాతమల్లంపేట పంచాయతీ శివారు బుడ్డడపాడు సమీపంలో రెండేళ్ల మొగ వద్ద చెక్ డ్యాం ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాల్లోని 2 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.
- సాలికమల్లవరం నుంచి వెంకటాపురం వెళ్లే మార్గంలో రెండు కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటు చేస్తే, గొలుగొండ–నాతవరం మండల ప్రజల ఇబ్బందులు తొలగుతాయి.

బీఎన్ రోడ్డు, గోవాడ సుగర్స్‌పై ఆశలు

చోడవరం: నియోజకవర్గంలో ప్రధానంగా అసంపూర్తిగా నిలిచిపోయిన బీఎన్ రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు విస్తరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.112 కోట్లు మంజూరు చేశారు. పనులను దక్కించుకున్న ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్ రెండేళ్ల కిందట పనులు ప్రారంభించి, వెంటనే ఆపేసింది. సదరు కాంట్రాక్టర్ టీడీపీ సానుభూతి పరుడు కావడంతో ఆ పార్టీకి ఎన్నికల్లో మేలు చేసేందుకే పనులు చేయకుండా వదిలేశారని అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అనేక సార్లు ధర్నాలు కూడా చేశారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ టీడీపీకి చెందిన కేఎస్ఎన్ఎస్ రాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రోడ్డు పనులపై అసెంబ్లీలో ప్రస్తావించి, పూర్తి చేయించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

- గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి ఆర్థికంగా ప్రభుత్వం సహకారం అందించి, 24 వేల సభ్య రైతులకు, 2 వేల కార్మిక కుటుంబాలకు అండగా ఉన్న ఫ్యాక్టరీని ఆదుకోవాలని కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో ఏటా రూ.20 కోట్ల మేర గ్రాంటు ఇవ్వడంతో పాటు సుమారు రూ.80 కోట్ల వరకూ ప్రభుత్వ హామీతో వడ్డీ ప్రభుత్వమే చెల్లించేలా రుణ సౌకర్యం కల్పించింది. ఆ నిధులతో 2019 వరకు టీడీపీ పాలకవర్గం చేసిన రూ.150 కోట్ల అప్పులో రూ.120 కోట్లు వరకూ చెల్లించింది. ఫ్యాక్టరీని అదే విధంగా ఆదుకునేలా చూడాలని ప్రజల ఆకాంక్ష.
- కోమళ్లపూడి వద్ద ఎస్ఈజెడ్ నిర్మించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వంలో 160 ఎకరాల భూసేకరణ చేశారు. మరో 100 ఎకరాలు సేకరించి, 240 ఎకరాల్లో సెజ్ ఏర్పాటు చేసి, పరిశ్రమలు నెలకొల్పితే ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

వీటితోపాటు నియోజకవర్గాల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న స్థానిక సమస్యలను కూడా పరిష్కరించేలా అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను ప్రజలు కోరుతున్నారు.

పట్టణం రూపు మారుతుంది



అసంపూర్తిగా నిలిచిన మెయిన్ రోడ్డు, ప్రత్యామ్నాయ రోడ్లను పూర్తిస్థాయిలో విస్తరిస్తే నర్సీపట్నం రూపురేఖలు పూర్తిగా మారతాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌తో నరకం చూస్తున్నాం. రోడ్లను పూర్తి స్థాయిలో విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది. టౌన్‌కు అందం వస్తుంది.

– బి.నాగరాజు, బొడ్డేపల్లి

రోడ్డు ఏర్పాటు చేయాలి



కరక నుంచి డొంకాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి. రోడ్డు లేకపోవడంతో ఆరిల్లోవ అటవీ ప్రాంతం నుంచి ప్రజలు కాలినడకన ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇక్కడ పండిన పంటను సైతం బయటకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామానికి రోడ్డు లేకపోవడంతో వైద్య సేవలు అందట్లేదు. పిల్లలు చదువుకు దూరమవుతున్నారు.

అప్పారావు, డొంకాడ గ్రామం, గొలుగొండ మండలం

శిథిలావస్థకు చేరిన స్కూల్ భవనాలపై కలెక్టర్‌కు నివేదన

- వర్షాలకు దెబ్బతిన్న స్కూళ్ల పరిశీలనలో డీఈవో వెంకటలక్ష్మమ్మ



పోతనపూడిలో శిథిలావస్థకు చేరిన పాఠశాల గదిని పరిశీలిస్తున్న డీఈవో

మాడుగుల రూరల్: మండలంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలల భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణం కొరకు కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న ఎంపీపీ స్కూళ్ల భవనాలను సోమవారం స్థానిక ఎంఈవో బి.దేముడమ్మతో కలిసి పరిశీలించారు. పోతనపూడి, చింతలూరు గదబూరు, తాటిపర్తి పంచాయతీ శివారు లక్ష్మంపేట ఎంపీపీ స్కూళ్లను పరిశీలించి, భవనాల దుస్థితిని తెలుసుకున్నారు. ఏ మాత్రం వర్షం వచ్చినా శ్లాబ్‌ల నుంచి నీరు కారిపోతోందని ఆయా స్కూళ్ల హెచ్ఎంలు డీఈవోకు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు పడుతున్న అవస్థలను డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. వీటి పరిశీలన అనంతరం ఆమె మాట్లాడుతూ స్కూళ్ల వారీగా నివేదికలు రూపొందించి, త్వరితగతిన నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు నివేదిస్తామని భరోసానిచ్చారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జీవీ లక్ష్మి

నాతవరం: ప్రజలకు తాగునీరు అందించేందుకు చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో నిర్మించిన పైలెట్ ప్రాజెక్టుపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని మండల ప్రత్యేకాధికారి జీవీ లక్ష్మి సూచించారు. మండలంలోని 16 గ్రామాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టును ఆమె సోమవారం తనిఖీ చేశారు. గుమ్మడిగొండ, నాతవరం పంచాయతీల్లో తాగునీటి పథకాలు, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయ స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేస్తే పైలెట్ ప్రాజెక్టులో నీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో అధికారులతో పరిశీలించి, ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. తాజా వర్షాలకు పంటపొలాలు, తోటలు, ఇళ్లు దెబ్బతింటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్, పంచాయతీ విస్తరణాధికారి ఎస్ఎస్‌వీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాల నుంచి రక్షణ



రొంగలినాయుడుపాలెంలో ప్రజలకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న రాజు

కె.కోటపాడు: పరిసరాల పరిశుభ్రతతో పాటు, మురుగునీటి నిల్వల్లేకుండా చర్యలు తీసుకుంటే రోగాల నుంచి రక్షణ పొందవచ్చని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు తెలిపారు. ఆర్‌వైఅగ్రహారంలో సోమవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అనంతరం వైద్య సిబ్బందితో అవగాహనా ర్యాలీని జరిపారు. హెల్త్ అసిస్టెంట్ ఆర్.గంగాధర్ పాల్గొన్నారు.

రొంగలినాయుడుపాలెంలో..

అవగాహనతోనే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు అన్నారు. రొంగలినాయుడుపాలెంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి, ఇంట్లోని నిల్వ నీటిని పూర్తిగా పారబోసి, పాత్రల్ని ఆరబెట్టాలన్నారు. దోమలు వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్తి శాతం దివ్యాంగ పింఛన్ అందించాలి



మంచంపైనే ఉన్న దివ్యాంగురాలు భవాని

రోలుగుంట: మంచానికే పరిమితమైన తన కుమార్తె అంగవైకల్యాన్ని గుర్తించి పూర్తిస్థాయి పింఛన్‌కు అర్హత కల్పించాలని దివ్యాంగురాలు అద్దిపల్లి భవాని తల్లి నాగమణి కోరారు. కొవ్వూరు గ్రామానికి చెందిన నాగమణికి ఒక కుమారుడు, కుమార్తె. కుమార్తె భవాని(24) పుట్టుకతో దివ్యాంగురాలు. ప్రభుత్వం దివ్యాంగులకు ఇస్తున్న రూ.6 వేలు పింఛన్ అందుతోంది. పూర్తి స్థాయి దివ్యాంగ పింఛన్ రూ.15 వేలు కోసం అధికారులను అభ్యర్థించినా ఫలితం లేదని తల్లి వాపోయింది. గ్రామానికి చెందిన బంటు రాజు, బుచ్చింపేటకు వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు స్థానిక విలేకరులకు తెలిపారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.31 కోట్లు



సభ్యుల వివరాలను పరిశీలిస్తున్న కనకమహాలక్ష్మి

నాతవరం: డ్వాక్రా సంఘాలకు స్త్రీనిధి ద్వారా ఈ ఏడాది రూ.31 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు స్త్రీనిధి క్లస్టర్ మేనేజర్ కనకమహాలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం స్త్రీనిధి రుణాల మంజూరుకు డ్వాక్రా సంఘాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లస్టర్ పరిధి మండలాల్లో ఇప్పటి వరకు రూ.6.40 కోట్ల రుణాలు అందించామన్నారు. ప్రస్తుతం క్లస్టరు పరిధిలోని ఐదు మండలాల్లో అర్హులైన డ్వాక్రా మహిళలందరికీ రుణాలిచ్చేందుకు రికార్డులు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో రుణం తీసుకుని సక్రమంగా చెల్లించే గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, డ్వాక్రా సంఘాల క్లస్టరు అధికారి రుత్తల శ్రీను, డ్వాక్రా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరల్ని అదుపుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయినిబాబు, చిత్రంలో దేముడు

కె.కోటపాడు: సామాన్య ప్రజలకు అందుబాటులో లేని నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి యర్రా దేముడు, గండి నాయినిబాబు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మహిళలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా కిలో రూ.80, ఉల్లిపాయలు కిలో రూ.55గా ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేస్తామని ప్రజలకు చెప్పిన టీడీపీ నాయకులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కేరళలో రేషన్‌డిపోల ద్వారా అందిస్తున్న 14 రకాలైన నిత్యావసర వస్తువులను రాష్ట్ర ప్రభుత్వం కూడా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాడి ప్రసాద్, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో వరి నారు సంరక్షణ



చెరువును తలపిస్తున్న వీరవల్లిలో నీట మునిగిన వరి నారు



గిడుతూరులో నారుమడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మాడుగుల రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన వరి నారు మడులు, వరినాట్లను మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు, మండలంలో పనిచేస్తున్న ఉద్యానవన సహాయకులు, వ్యవసాయ సహాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల్ని కలిసి వాటి రక్షణకు పలు సూచనలు చేశారు. నారు మడిలో నీరు నిల్వలేకుండా బోదులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గత నెల్లో వేసిన వరినాట్లతో పాటు ఈ నెలలో వేసిన వరినారు మడుల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు. వర్షాలకు నారు మడిలో విత్తనం చల్లిన 2 నుంచి 3 రోజుల వయస్సులో మూడు రోజులు కన్నా ఎక్కువ నీట మునిగితే మెలకశాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. 7 నుంచి 30 రోజుల మధ్య వయసున్న నారు 5 రోజులుకన్నా ఎక్కువ నీటి ముంపులో ఉంటే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఐదు రోజుల్లోపే నీరు పూర్తిగా బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

మాడుగుల రూరల్: తాజా వర్షాలకు ఇటీవల వేసిన వరినారు నీటి ముంపునకు గురయింది. ఈ నెల మొదటి వారంలో రైతులు వరినారు మడులు సిద్ధం చేసుకుని, నారు పోశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా చోట్ల నారు మడుల్లో భారీగా నీరు చేరింది. వీరవల్లి, పోతనపూడి, కె.జె.పురం, ముకుందపురం, వంటర్లపాలెం, మాడుగుల, జి.అగ్రహారం, వీరనారాయణం, చింతలూరు, ఎం.కోటపాడు, వల్లాపురం, గాదిరాయి తదితర గ్రామాల్లో వేసిన వరి నారు మడులు నీట మునిగాయి. కొన్ని చోట్ల నారు మడులు చెరువులను తలపిస్తున్నాయి. వీలైనంత వేగంగా నీటిని నారు మడుల్లో నుంచి బయటకి పంపే ఏర్పాట్లు చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు చెప్తున్నారు.

మాకవరపాలెం: నారుమడుల సంరక్షణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు భవాని, శైలజ సూచించారు. వర్షాల నేపథ్యంలో మండలంలోని పైడిపాల, బయ్యవరం, గిడుతూరు గ్రామాల్లోని నారుమడులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నారుమడుల్లో ఉన్న నీటిని వెంటనే తొలగించాలని రైతులకు తెలిపారు. నీరు తొలగించాక నారు మడిలో యూరియా, పొటాస్ చల్లుకోవాలన్నారు. నారుమడికి తెగుళ్లు సోకకుండా గ్రాము కార్బండిజంను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో చిరంజీవి, ఏఈవో శేషునాయుడు, సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అప్రమత్తం



భాను పుష్పలీలావతి

మాడుగుల రూరల్: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉద్యాన పంటల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఉద్యానవన శాఖాధికారి వి.భాను పుష్పలీలావతి తెలిపారు. సోమవారం ఆమె మాడుగుల, రావికమతం మండలాల్లో కాయగూరలు, పండ్ల తోటలను సందర్శించారు. పంటల రక్షణకు యాజమాన్య పద్ధతుల్ని వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

కూరగాయల సాగులో..

- ఎండు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మెటలాక్సిల్–మాంకోజెట్ 2 గ్రాములు కలిపి మొక్కల మొదళ్ల వద్ద వేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బండిజమ్ 1 గ్రాము లేదా మాంకోజెట్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో పిచికారీ చేసి చల్లాలి.
- బూజు తెగులు నివారణకు మెటలాక్సిల్–మాంకోజెట్ తగు మోతాదులో పిచికారీ చేయాలి.
- బాక్టీరియా, ఆకుమచ్చ తెగుళ్లకు 10 లీటర్ల నీటికి 30 గ్రా.ల కాపర్ ఆక్సీక్లోరైడ్ గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి వ్యాప్తిని అరికట్టవచ్చు.

అరటి తోటల్లో..

- గాలిలో అధిక తేమ వల్ల సిగటోక ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు ప్రొపికొనజోల్ 1.0 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి జిగురుతో పాటు పిచికారీ చేయాలి.
- భూమిలో అధిక తేమ వల్ల అరటి దుంపలు కుళ్లిపోకుండా ఆక్సీక్లోరైడ్ 3.0 గ్రాములు లేదా ఒక శాతం బోర్డో మిక్స్ దుంప చుట్టూ తడిచేలా పోయాలి.

బొప్పాయి తోటలకు..

- అధిక వర్షాలతో బొప్పాయి మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లిపోయే లక్షణాలు గుర్తిస్తే రిడోమిల్ 2.0 గ్రా.లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎలైట్ 2.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్లలో పోస్తే సరిపోతుంది.
- పండు ఈగ ఉధృతి నివారణకు మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరాకు 10 నుంచి 15 ఏర్పాటు చేస్తే సరిపోతుందని భాను పుష్ప లీలావతి తెలిపారు.

నిండుకుండల్లా చెరువులు



వర్షపు నీటితో నిండుగా కనిపిస్తున్న ఎర్రవరం చెరువు

గొలుగొండ: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు నిండుకుండల్ని తలపిస్తున్నాయి. ఎడ తెరిపి లేకుండా కురిసిన వానలకు ఎర్రవరం, చీడిగుమ్మల, పప్పుశెట్టిపాలెం, పాకలపాడు, కృష్ణదేవిపేట, ఏఎల్ పురం, నాగాపురం, జోగుంపేట ప్రాంతాల్లో ఉన్న చెరువులు పూర్తిగా నిండిపోయాయి. ఈ చెరువుల దిగువన సుమారుగా 800 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ప్రస్తుతం నారు మడులు సిద్ధంగా ఉండటంలో ఖరీఫ్‌కు ఢోకా ఉండదని రైతులు చెప్తున్నారు. ఈ ఏడాది నూరుశాతం అన్ని ప్రాంతాల్లో నాట్లు జరిగే అవకాశం ఉందంటున్నారు. గొలుగొండ ప్రాంతంలో ఇప్పటికే దమ్ములు పట్టే పనుల్లో రైతులు ఉన్నారు.

గిరిజన గ్రామాలకు లింక్ రోడ్లు నిర్మించాలి

దేవరాపల్లి: వాలాబు పంచాయతీ శివారు గిరిజన గ్రామాలకు లింక్ రోడ్ల సదుపాయం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించామన్నారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మండల కార్యదర్శి బీటీ దొరతో కలిసి మీడియాతో మాట్లాడారు. పంచాయతీలోని కోడాపల్లి, రామన్నపాలెం, పూలగరువు, బుచ్చంపాలెం, బొర్రచింత, కె.టి.పాలెం మీదుగా కోనాంకు, బయటగరువు, బొడ్డగుమ్మి మీదుగా నగరం పాలేనికి లింక్ రోడ్ల సదుపాయం లేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఎవరికి అనారోగ్యం వచ్చినా డోలీ మోతలు తప్పట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.